క్లుప్తంగా

దైవ చింతన కలిగి ఉండాలి



మరిపెడ రూరల్: ప్రతీ ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. గిరిజనుల ఆరాధ్యదైవమైన మరిపెడ మండలం బోట్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో బుధవారం భోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. డోర్నకల్ ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, పెద్దబోయిన ఐలయ్య, మాజీ సర్పంచ్ భూక్య కృష్ణ, భోజ్యానాయక్, వీరభద్రం, గౌతమ్ పాల్గొన్నారు.

8నుంచి వార్షిక పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఎఫ్ఏ టూ వార్షిక పరీక్షలు ఈ నెల 8వ తేదీ సోమవారం నుంచి 20వ తేదీ వరకు 1వ తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈపరీక్షలకు సంబంధించని ఫలితాలను ఈనెల 23న విడుదల చేయనున్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల బహిష్కరణ

గూడూరు: గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసిన ప్రతి ఒక్కరినీ జిల్లా పార్టీ ఆదేశానుసారం పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి ఆదేశానుసారం మండలంలోని రాములుతండా గ్రామ పార్టీ అధ్యక్షుడు గోదాసి వెంకన్న, చిర్ర కుంటతండా గ్రామ పార్టీ అధ్యక్షుడు బానోతు రవిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్, వాంకుడోతు కొమ్మాలు, రాసమల్ల యాకయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి

డోర్నకల్: జైను ఆరాధ్య దైవం మహవీర్ భగవాన్ జయంతి వేడుకలను బుధవారం డోర్నకల్‌లో ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని ఆదినాథ్ భగవాన్ మందిరంలో జైనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైన మందిరం నుంచి మెయిన్ రోడ్డు, గంధీ సెంటర్, బ్యాంక్ స్ట్రీట్ మీదుగా ర్యాలీ చేపట్టారు.

ఉపాధి పనికి రాకుంటే కార్డు తొలగిస్తాం..


డోర్నకల్: ఉపాధి పనులకు రాని కూలీల జాబ్ కార్డులు తొలగిస్తామని ఈజీఎస్ ఏపీఎం పార్థసారథి తెలిపారు. పీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..పాధి పనులకు రానివారి జాబ్‌కార్డులను తొలగిస్తామని తెలిపారు. పేద కూలీల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు జాబ్‌కార్డులు ఉంటేనే వర్తిస్తాయని తెలిపారు. జిల్లాలో 42వేల మంది ఉపాధి పనుల్లో పాల్గొంటుండగా.. డోర్నకల్ మండలంలో 2,400 మంది మాత్రమే పనులు చేస్తున్నారని తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి



కేసముద్రం: ప్రజలు పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచించారు. మండలంలోని భవాని గడ్డతండా జీపీ జిల్లెల్ల తండాలో కేసముద్రం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. తండావాసులు జ్వరాల బారిన పడుతున్న విషయం తెలుసుకుని రక్తన మూనాలను సేకరించారు. పీఓ సుధీర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ నంబీకిషోర్, గోపిచంద్, పురుషోత్తం, జనార్ధనాచారి పాల్గొన్నారు.

ఎన్నిక



రియాజ్ పాషా, అధ్యక్షుడు

మరిపెడ: మరిపెడ మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మహ్మద్ రియాజ్‌పాషాను ఎన్నుకున్నట్లు ఎన్నికల అబ్జర్వర్లు శ్రీరంగ శ్రీనివాస్, గాడిపెల్లి శ్రీశైలం బుధవారం తెలిపారు. ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా గందసిరి ఉప్పలయ్య, ప్రధానకార్యదర్శిగా రాంపెల్లి వీరాంజీ, ఉపాధ్యక్షులుగా బోడ నాగేందర్, మూడు శ్రీకుమార్, సహాయకార్యదర్శులుగా మహేందర్, షేక్ షాన్‌వాజ్, మాలోతు తిరుపతి, కోశాధికారిగా మచ్చ రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జిన్నా లచ్చయ్య, సహాయ సెక్రటరీగా పోతుల గోవర్ధన్‌తోపాటు, కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులను ఎన్నుకున్నారు. సీనియర్ జర్నలిస్ట్ షేక్ అక్తర్‌పాష, వంకాయలపాటి తిరుమలరావు, రాజేష్, ఆర్. వెంకటేశ్వర్లు, ఉమేష్, మహబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

● మున్సిపల్ కమిషనర్ రవీందర్



డోర్నకల్: సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి

మహబూబాబాద్: ఎండతీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు. ఎండాకాలంలో వచ్చే వడగాలులు, వడదెబ్బతో సంభవించు మరణాలను నియంత్రించుటకు సంబంధిత శాఖల అధికారులతో స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

నీటి ఎద్దడి నివారణకు పాటుపడాలి

కురవి: వేసవిలో అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ వీరబాబు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంచినీటి బావులను అద్దెకు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ యాకాంబ్రం, ఏఎస్ఐ సదయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం కలగొద్దు

డోర్నకల్: గ్రామాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి కోరారు. వేసవిలో తాగు నీటి ఎద్దడి యాక్షన్‌ప్లాన్ అమలుపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దారావత్ శ్రీనివాసరావు, ఎంపీఓ మీర్జా మున్వర్‌అలీ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ ఎల్లప్పుడు ప్రజల పక్షాన నిలబడి, వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. నియోజవర్గ పరిధి లోని ఐదు మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 6వ తేదీన తుక్కుగూడలో జరగబోయే జన జాతర మహాసభకు భారీ ఎత్తున జన సమీకరణ చేయాలని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజయ్య, మండల పార్టీల అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, అల్లం నాగేశ్వర్ రావు, కురెల్లి సతీష్, గొల్లపల్లి ప్రభాకర్, చిట్టి వెంకన్న, కత్తి స్వామి, యాదవరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మానుకోట సిగ్నల్ కాలనీలోని ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్ చైర్లను ఎమ్మెల్యే మురళీనాయక్ ఉచితంగా పంపిణీ చేశారు.

సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలి



తొర్రూరులో మాట్లాడుతున్న ఎస్సై జగదీష్

కొత్తగూడ: సైబర్ క్రైంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గూడూరు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం గాంధీనగర్ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. సెల్ ఫోన్‌కు వచ్చే అన్ని మెసేజ్‌ల లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. కొన్ని లింకుల ద్వారా బ్యాంకు, ఇతర వివరాలు చోరీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఓటీపీలు అడగడం, పాస్ వర్డులు అడగడం లాంటివి చేసి డబ్బులు కొట్టేస్తారని వివరించారు. ఏదైనా మోసం జరిగిందని గ్రహించిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్సై దిలిప్ పాల్గొన్నారు.

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బొలగాని రాములు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎస్సై జగదీష్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణ, సునిల్ పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకి వెళ్లాలి



గార్ల: మాట్లాడుతున్న డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్



గూడూరు: సమావేశమైన ఎంపీడీఓ, వైద్యాధికారులు

గార్ల/గూడూరు/చిన్నగూడూరు: రోజురోజుకూ ఎండతీవ్రత పెరుగుతున్నందున అత్యవసర సమయాల్లోనే ప్రజలు బయటకి వెళ్లాలని ముల్కనూరు పీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, గూడూరు ఎంపీడీఓ వీరస్వామి, చిన్న గూడూరు ఎంపీడీఓ రామారావు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో వారు మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు బయటకు వెళ్లకూడదని పేర్కొన్నారు. బయటకు వెలితే తెల్లని కాటన్ దుస్తులను ధరించాలని, టోపీ, గొడుగు వాడాలని సూచించారు. నిత్యం మంచినీళ్లు, పండ్ల రసాలు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్ పానియాలను సేవించాలని సూచించారు. వడదెబ్బకు గురైన వెంటనే చల్లని ప్రదేశాలకు తరలించి, తడిగుడ్డతో శరీరాన్ని తుడిచి ఫ్యాన్ గాలికి ఉంచాలన్నారు. వడదెబ్బకు గురైన వారు ప్రాణాలు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు రవీందర్, స్వేత, ఎస్సై జీనత్‌కుమార్, డీటీ సుధాకర్, వైద్యాధికారులు హనుమంతరావు, యమున, రాంబాబు పాల్గొన్నారు. కాగా.. చిన్నగూడూరు మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్‌పర్సన్‌గా తహసీల్దార్ మహబూబ్ ఆలీ, మెంబర్ కన్వీనర్‌గా మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్, కమిటీ మెంబర్‌గా ఎస్ఐ ఝాన్సీ ఉంటారని తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



గుడుంబా స్థావరాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

తొర్రూరు రూరల్: మండలంలోని పలు గిరిజన తండాల్లో గుడుంబా స్థావరాలపై జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి కిరణ్ పర్యవేక్షణలో తొర్రూరు ఎక్సైజ్‌శాఖ అధికారులు బుధవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా తొర్రూరు సీఐ ప్రవీణ్ మాట్లాడుతూ.. సుందర్‌నాయక్ తండ, సంధ్య తండ, అమర్‌సింగ్ తండాల్లో దాడులు చేసి 3 బైక్‌లు, 50 లీటర్ల నాటు సారాను స్వాధినం చేసుకొని, 1500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, సంబంధిత 4 వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. ఎస్సైలు తిరుపతి, అనిల్, సిబ్బంది సత్యప్రసాద్, ప్రభాకర్ మాదన్‌ఖాన్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 50లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 1500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి నలుగురిపై కేసు నమోదు చేసి 3ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు తొర్రూర్ ఎక్సైజ్ ఎస్సై ప్రవీణ్ బుధవారం తెలిపారు. మహబూబాబాద్ డీపీఈఓ కిరణ్ పర్యవేక్షణలో తొర్రూర్ ఎక్సైజ్ పోలీసులు నాటు సార స్థావరాలపై దాడులు చేసినట్లు తెలిపారు. నెల్లికుదురు మండలంలోని నర్సింహులగూడెం గ్రామ శివారు సుందర్ తండా, సంధ్యతండా, అమర్ సింగ్ తండాలో బుధవారం దాడులు చేసి మూడు ద్విచక్ర వాహనాలతో పాటు 50లీటర్ల నాటు సార స్వాదీనం చేసుకుని 1500లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎస్సైలు తిరుపతి, అనిల్ సిబ్బంది ప్రసాద్, ప్రభాకర్, మాధర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

గార్ల: ప్రతీఒక్కరు ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సీఐ రవికుమార్ ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని ఎర్రమట్టి తండాలో కమ్యూనిటీ పోలీసింగ్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో గొడవలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో గుడుంబా, గంజాయిని అరికట్టేందుకు గ్రామస్తులు 100కు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలపై ఏమైనా అఘాయిత్యాలు జరిగితే వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలని, సైబర్ క్రైం బారిన పడితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. సమావేశంలో ఎస్సై జీనత్‌కుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మంగీలాల్, రాము, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవం జరిపించిన అర్చకులు, భక్తులు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని అత్యంత చారిత్రక నేపథ్యం కలిగిన సీతారామచంద్రస్వామి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ గుడి రాధాకృష్ణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణ ప్రసాద్, యాజ్ఞికులు అగ్నిహోత్రం మిధున్ ఆధ్వర్యంలో రాములోరి కల్యాణోత్సవం జరిగింది. దత్తు, ప్రణయ్, దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, డాక్టర్ బొడ్ల మధుసూదన్ రావు, ఓం నారాయణ లోయ, అంబరీష, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.


మాదిగలను విస్మరిస్తున్న కాంగ్రెస్



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు టిక్కెట్‌లను కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి అవమానిస్తూ మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్‌మాదిగ అన్నారు. మాదిగలకు పార్లమెంట్ టిక్కెట్‌లు నిరాకరించడాన్ని నిరసిస్తూ అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంట్ స్థానాలు ఉంటే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఇవ్వకుండా విస్మరించారన్నారు. 20 శాతం కలిగిన మాలలకు రెండు సీట్లు, 75 శాతం గల మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పునరాలోచన చేసుకోవాలని లేనిపక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పోలెపాక ఎల్లయ్య, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక, నాయకులు పాష, కందిపాటి భిక్షపతి, వెంకన్న, రజిత, సావిత్రి, సోమయ్య పాల్గొన్నారు.

సుధాకర్‌రావు సేవలు చిరస్మరణీయం



సుధాకర్‌రావు జయంతి వేడుకల్లో స్థానికులు

పెద్దవంగర: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు నియోజకవర్గ ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన సోదరులు నెమరుగొమ్ముల ప్రదీప్‌రావు, బీఆర్ఎస్ నేత ముత్తినేని శ్రీనివాస్ అన్నారు. సుధాకర్‌రావు జయంతి వేడుకలు సన్నిహితులు, స్థానికుల సమక్షంలో బుధవారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఉపాధి కూలీలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తంగళ్లపల్లి మల్లిఖార్జునాచారి, శ్రీనివాస్‌గౌడ్, కుమారస్వామి, ఊషయ్య, సుభాష్ పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాతలు

తొర్రూరు రూరల్: వేసవిలో దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జన వికాస సంస్థ కోఆర్డినేటర్ శైలజ అన్నారు. బుధవారం మండలంలోని చింతలపల్లిలోని బస్టాండ్ సెంటర్‌లో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు శోభరాణ, గ్రామ పెద్దలు కాటం మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, సంతోష్, మహిళలు పాల్గొన్నారు.

అభినందనీయం

పెద్దవంగర: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి వెంకన్న, సిబ్బంది నర్సింహమూర్తి, రాజు, అశోక్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గూడూరు: మండలంలోని నాయకపల్లి, గాజులగట్టు, అయోధ్యపురం, గూడూరు, బొద్దుగొండ గ్రామాలలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం రవీందర్ ప్రారంభించి, మాట్లాడారు.

మహబూబాబాద్ రూరల్ : కంబాలపల్లి, రెడ్యాల, ముడుపుగల్లు, అమనగల్, పర్వతగిరి, మల్యాల గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి, ఎంపీఓ హరిప్రసాద్, ఏపీఎం తిలక్ గౌడ్, సీసీలు శ్రీదేవి, ధనుంజయ, సుమలత, ఏఈఓలు శ్రీనివాస్, సరిత, రాజ్యలక్ష్మి, వీఓ సంఘాల బాధ్యులు అరుణ, సునీత, కవిత, దివ్య, కవిత, నారాయణసింగ్, సుధాకర్, విజయ, స్వర్ణలత, మంజుల, సోనీ, శైలజ, విజయ, వీణ, రజిత, అలివేలు, కోమటి, తిరుమల, లత, ఉప్పమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

గూడూరు: మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ బుధవారం మండలంలో పలు వివాహ వేడుకలకు హాజరై అనంతరం పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించారు. ముందుగా బొల్లెపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కూతురు పెళ్లికి, గూడూరులో మరో కార్యకర్త కూతురు పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అక్కడ నుంచి పొనుగోడులో మృతిచెందిన కనుకుల నర్సయ్య, సీతానగరం శివారు రెడ్డిపల్లెలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎడ్ల నరేష్‌రెడ్డి బంధువు మృతిపట్ల వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, బీరం శ్రీపాల్‌రెడ్డి, మదుగౌడ్, కొమ్మాలు, యాకయ్య పాల్గొన్నారు.

ప్రింటర్‌లో దూరిన పాము

కేసముద్రం: కేసముద్రంస్టేషన్‌లోని ఓ జిరాక్స్ సెంటర్‌లోని ప్రింటర్‌లో పేపర్ పెడుతున్న క్రమంలో, అప్పటికే ప్రింటర్‌లో దూరిన పామును యజమాని గుర్తించి ఒక్కసారిగా ఉలికిపడ్డాడు. ప్రింటర్‌ను బయటకు తీసుకొచ్చి పామును వెళ్లగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. కాసేపటికి పాము పారిపోవడంతో అంతాఊపిరిపీల్చుకున్నారు.

సన్మానం

తొర్రూరు రూరల్: మావోయిస్టు పార్టీలో అనేక సంవత్సరాలుగా పని చేసి ఇటీవల లొంగిపోయిన మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన చాంద్ బీ అలియాస్ జ్యోతక్కను జడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్‌తోపాటు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం సత్కరించారు. కొండ వెంకన్న, మురళి, భిక్షపతి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

మహబూబాబాద్ రూరల్ : ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు మారగని రాజుగౌడ్ అన్నారు. లభార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ మండలంలోని లక్ష్మీపురం, వేమునూరు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన ప్రజల ఇంటింటికి తిరిగి బుధవారం వారితో మాట్లాడారు. బూత్ అధ్యక్షులు పిల్లమర్రి గోవర్ధన్, వీరన్న, గణేష్, మండల ప్రధాన కార్యదర్శి నెల్లూరి సతీష్, ఉపాధ్యక్షుడు తరంజిత్ రెడ్డి, భూక్యా హుస్సేన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కావ్యను కలిసిన ఎమ్మార్పీఎస్ టీఎస్ నేతలు

నెహ్రూసెంటర్: కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర నేతలు వారి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కోండ్ర ఎల్లయ్య, కేదాసి మోహన్, సంజీవ ఉన్నారు.

బాలల గుర్తింపును వెల్లడించొద్దు

మహబూబాబాద్: ఏదైనా ఘటనలో బాధితులు బాలలు అయితే వారి వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెల్లడించొద్దని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు లోపు బాధితుల పేర్లు వెల్లడిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. ఏదైనా కేసు విషయంలో పరిష్కరించి మూసివేసిన తర్వాత క్లియరెన్స్ సర్టిఫికెట్ విషయంలో ఆ కేసుకు సంబంధించి ఏ రికార్డును వెల్లడించొద్దని పేర్కొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా..

పెద్దవంగర: కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డికుంట తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత బానోతు బుచ్చిరాములు అనారోగ్యంతో బాధపడుతుండగా బుధవారం ఝాన్సీరెడ్డి పరామర్శించారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ అధికారం లేక పదేళ్ల పాటు కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా నష్టపోయారని, వారికి ఇప్పుడు పార్టీ, ప్రభుత్వం అండగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విజయపాల్‌రెడ్డి, మురళి, సైదులు, జగ్గానాయక్, శ్రీనివాస్, గోపాల్ పాల్గొన్నారు.

బీజేపీ వీడియో వ్యాన్ ప్రచారం

గూడూరు: జరుగబోయే సార్వత్రిక ఎన్నికలల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన వీడియో వ్యాన్ ప్రచారాన్ని మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్ ప్రారంభించారు. మేరెడ్డి సురేందర్, శ్రీశైలం, నాగరాజు, ఐలయ్య పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

మరిపెడ రూరల్/మహబూబాబాద్ అర్బన్: ఇటీవల భారీగా పెంచిన టెట్ ఫీజును పెంచి నిరుద్యోగులపై మోపిన భారాన్ని వెంటనే తగ్గించాలని డీఎడ్, బీఎడ్ సంఘం రాష్ట నాయకుడు బానోతు రమేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరిపెడ మండలంలోని బాల్యతండాలో, జిల్లా కేంద్రంలోని బీఎడ్ కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు వేల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్‌లు తీసుకుని ప్రభుత్వ అసమర్ధ వల్ల పరీక్షలు రాయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక పేపర్‌కు రూ.300, రెండు పేపర్లకు రూ.400 ఫీజు ఉండేదన్నారు. ప్రస్తుత నోటిఫికేషన్‌లో ఏకంగా ఐదు రేట్లు పెంచి రూ.2000 నిర్ణయించడం సరికాదన్నారు. శ్రీనివాస్, మహేష్, రాంబాబునాయక్, బాలు నాయక్, హరిసింగ్, సూర్యప్రకాష్, సాయి కుమార్, దేవేందర్, సింహాంద్రినాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

తొర్రూరు: భక్తులు ఆర్టీసీ సంస్థ సేవలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. భద్రాచల సీతారాముల కల్యాణ తలంబ్రాల పోస్టర్లను ఆర్టీసీ లాజిస్టిక్స్ ప్రతినిధులతో కలిసి ఆమె బుధవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణ తలంబ్రాలను రూ.151లకు భక్తులకు చేరవేసేందుకు ఆర్టీసీ సంస్థ నిర్ణయించిందన్నారు. ఇతర వివరాలకు 91542 98766 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఆర్టీసీ లాజిస్టిక్స్ డీఎంఈ చైతన్యకుమార్, రాజు, సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్ని జిల్లాల మాదిరిగా రెమ్యునరేషన్ ఇప్పించాలి

మహబూబాబాద్: గత డిసెంబర్‌లో జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్ని జిల్లాల మాదిరిగానే రెమ్యునరేషన్ ఇప్పించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బద్రి నారాయణ, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాకుబ్, రమేశ్, కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. ఆయా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందచేసి, మాట్లాడారు. గతంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి పలు సెంటర్లలో మెటీరియల్ అందచేసిన తర్వాత రాత్రి 12గంటల వరకు రవాణా సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ఈసారి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. పోలింగ్ విధులు నిర్వర్తించలేని దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి పోలింగ్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.